క్లుప్తంగా

ఘనంగా కోదండరాముని ఆలయ వార్షికోత్సవం


కోదండ రామచంద్రస్వామి

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరం కముజువారిపాలెంలో వేంచేసిన కళ్యాణ కోదండ రామచంద్ర స్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని కళ్యాణ కోదండ రామచంద్రస్వామి వారి భక్త బృందం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు.

ఉమాకొప్పేశ్వరుని కల్యాణ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


కొప్పేశ్వరస్వామి కల్యాణ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 16 నుంచి 21 తేదీ వరకూ జరగనున్న కొత్తపేట మండల పలివెల ఉమాకొప్పేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల గోడ పత్రికను సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. మండలంలోని గోపాలపురం ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు.

ఎంఈఓ మృతి తీరని లోటు


ఎంఈఓ ప్రసాదరాజుకు సంతాపం తెలుపుతున్న ఉపాధ్యాయులు

మామిడికుదురు: ఎంఈఓ కె.ప్రసాదరాజు మృతి తీరని లోటని పలువులు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్సీ వద్ద సోమవారం ఎంఈఓ ప్రసాదరాజుకు ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నిరంజని, మోకా వెంకన్నబాబు, బావరాజు సూర్యప్రకారావు, టీఎస్ ప్రసాదరావు, జి.సాయిబాబు, కె.హరనాథ్, ఎన్.విజయకుమారి, యూటీఎఫ్, ఎస్టీయూ, బీటీఏ సంఘాల ప్రతినిధులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


వాడపాలెం అయ్యప్పస్వామికి పూజలు జరిపిస్తున్న భక్తులు

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో అయ్యప్పస్వామి, జ్ఞాన సరస్వతి పరివార దేవతల ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బండారు బులితాత, ఆలయ ఇన్‌చార్జ్ మట్టా బాబ్జి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు దొంతికుర్తి రామచంద్రరావు, పండితులు తెల్లవారుజాము నుంచి గణపతి పూజతో ప్రారంభించి పలు పూజలు నిర్వహించారు. పలువురు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించి, సేవల్లో పాల్గొన్నారు. వాడపాలెం, కొత్తపేట, వానపల్లి పరిసరా ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆబోతుల వీరంగం

అంబాజీపేట: చేతికి అందివచ్చిన పంటలను నాశనం చేస్తూ, పశువులను, ప్రజలపై తరచూ ఆబోతులు వీరంగం చేస్తున్నాయని ఇరుసుమండకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఆబోతులను అరికట్టాలని కోరుతూ అంబాజీపేటలో జరిగిన స్పందనలో రైతులు సోమవారం ఫిర్యాదు చేశారు. బొక్కా శ్రీనివాసరావు, మట్టపర్తి శ్రీకృష్ణబాలకరావు, చిన్నం రామారావు, వారా వెంకట సుబ్బారావు, అరిగెల వెంటేశ్వరరావు, బండి సురేష్ మాట్లాడుతూ గ్రామంలో 8 ఆబోతులు చేతికి అందివస్తున్న అరటి పంటను ధ్వంసం చేశాయని వాపోయారు. గ్రామంలో అరటి, వరి పంటలతో పాటు ఇతర పంటలను ధ్వంసం చేస్తున్నాయన్నారు. ఇటీవల 3 ఏళ్ల ఆవు దూడను పొడిచి చంపేశాయన్నారు. అలాగే గ్రామంలో ప్రజలను పొడుస్తూ భయబ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ఎప్పుడు ఏం చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నామని స్పందన అధికారులకు వివరించారు. తక్షణమే భయబ్రాంతులకు గురిచేయడంతో పాటు, పంటలను నాశనం చేస్తున్న ఆబోతులను అరికట్టాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్పందన అధికారులకు అందజేశారు.

నింగీ నేలా ఒకటాయెలే..

- అభ్యుదయ భావాల కలయిక
- ప్రేమికుల రోజు ప్రత్యేకం

ఈ రేయి తీయనిది.. ఈ చిరుగాలి మనసైనది అంటూ ప్రేమజంటలు పాటలు పాడుకుంటూ మనసూ, తనువు కలిపి ముందుకు సాగుతారు. కానీ పెళ్లితో మూడు ముళ్లు, ఏడడుగులు వేసి జీవితంలో హాయిగా ముందుకు సాగుతూ సమాజంతో తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న జంటల అన్యోన్య దాంపత్యంపై ప్రేమికుల రోజు సందర్భంగా ప్రత్యేక కథనం.

పెద్దలను ఒప్పించారు


డాక్టర్ భవానీశంకర్-పూర్ణిమాదేవి దంపతులు

ఆలమూరు: చదువుతున్న సమయంలో మొగ్గ తొడిగిన ప్రేమలో వైద్యాధికారి పి.భవానీశంకర్, పూర్ణిమాదేవి ఒకరిపైఒకరు ఆకర్షితులైనారు. దాదాపు పదేళ్ల ప్రేమ అనంతరం జీవితంలో స్థిరపడి కులాలు వేరైనా తల్లిదండ్రులను ఒప్పించి వైవాహిక బంధంలో అడుగుపెట్టారు. అయితే భార్య పూర్ణిమాదేవి తన ఇద్దరు చిన్నారుల ఆలనపాలన కోసం తన అధ్యాపక వృత్తిని వదిలేశారు. డాక్టర్ భవానీశంకర్-పూర్ణిమదేవి వైవాహిక జీవితం నేటికీ అన్యోన్యంగా కొనసాగుతుంది. వీరి ప్రేమ, జీవితంలో స్థిరత్వం, తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకున్న తీరు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. వైద్యాధికారిగా భవానీశంకర్ ప్రజలకు నిరాడంబరంగా వైద్యసేవలు అందిస్తూ పేదల పెన్నిధిగా పేరు గాంచారు.

అభ్యుదయ ప్రేమ


కుమార్తె, కుమారుడితో వరప్రసాద్-శ్రీదేవి దంపతులు

మలికిపురం: కులాలు వేరైనా అభ్యుదయ భావాలు కలిగిన వారిరువురూ ప్రేమ పేరుతో ఒక్కటయ్యారు. వారే సఖినేటిపల్లి మండలం ఉయ్యూరివారి మెరక గ్రామానికి చెందిన పెసల వీవీ సత్య వరప్రసాద్, మలికిపురానికి చెందిన మంగెన శ్రీదేవి. 14 ఏళ్ల క్రితం 2009లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకారం తెలిపారు. ఎంఎస్సీ, ఎంఈడీ సైకాలజీ చేసిన శ్రీదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ చేసిన ప్రసాద్ విశ్వేశ్వరాయపురంలో వివేకానంద కాన్వెంట్ నడుపుతూ తక్కువ ఫీజులకే పేద విద్యార్థులకు విద్య నేర్పుతున్నారు. స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వారా పిల్లలలో ఒత్తిడి తగ్గించేందుకు పాఠశాల స్థాయిలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నేటి తరానికి ఆదర్శప్రాయం


రామకృష్ణ-అనిత దంపతులు

ఆలమూరు: సామాన్య కుటుంబంలో జన్మించిన రామకృష్ణ-అనితలు కష్టపడి చదువుకుని మెరుగైన ర్యాంకు సాధించి విద్యాభ్యాసం చేశారు. చదువుకొనే ఇరువురి మనసులు కలవడంతో ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ప్రేమించుకున్నారు, సామాజిక పరంగా కులాలు వేరైనా ఆజంట పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. తొలినాళ్లలో సహజంగా ఎదురైన ఇబ్బందులను మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొని పశుసంవర్ధకశాఖలో వైద్యాధికారులుగా ఇరువురు ఉద్యోగాలు సాధించారు. వివాహమై 28 ఏళ్లు పూర్తయినా ఎలాంటి అరమరికలు లేని జీవితాన్ని గడుపుతూ ప్రతి విషయంలోను సమష్టి బాధ్యత తీసుకుంటూ ఒకే మాట-ఒకే బాటపై ఉంటూ నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం రామకృష్ణ రామచంద్రపురం పశుసంవర్ధకశాఖ ఏడీగా, అనిత ఆలమూరు ఏడీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం


కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న విద్యార్థిని

కొత్తపేట: సమాజంలో సగభాగం వున్న మహిళలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులు కాపాడుకుంటూ, ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజనీనాయుడు జయంతి పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ పెద్దిరాజు అధ్యక్షతన జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలికలు, యువతులు, మహిళలు ధైర్యంగా సమాజంలో ముందుకు వెళ్లాలన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.అరుణ్‌కుమార్, కళాశాల విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ టి.రమాదేవి, సభ్యులు పీవీఎస్ భ్రమరాంబ, అరుణసుందరి, సీహెచ్ నాగరాణి, నాగదీపిక, నాగశ్రీలక్ష్మి, దీపికాదేవి, నాగజ్యోతి, ప్రసన్నజ్యోతి, జాయ్ సి.సాయిలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక, మట్టి తరలింపు


శానపల్లిలంక రైల్వే వంతెన వద్ద ఉంచిన మట్టి, ఇసుక అక్రమ తరలింపుతో ఏర్పడిన గొయ్యి

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంక రైల్వే వంతెన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఇసుక, మట్టి నిల్వలను కొందరు రాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న కొంత మంది నాయకుల అండతో ఈ ఇసుక, మట్టిని అక్రమంగా తరలిచి సొమ్ములు చేసుకుంటున్నారనే అభియోగాలు ఉన్నాయి. ఇంత జరుగుతున్న రెవెన్యూ యంత్రాంగం తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సామాన్యులు తమ అవసరాలు, మెరక పనుల కోసం మట్టి, ఇసుక తరలింపునకు రెవెన్యూ అధికారులు కనీసం అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. ఇంత పెద్ద మొత్తంలో మట్టి, ఇసుక శానపల్లిలంక నుంచి తరలిస్తుంటే రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన అధికారులు కనీసం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానిక తహశీల్దార్ రియాజ్ హుస్సేన్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, అధికారులతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మట్టి తవ్వకాలు సహించం


కేశవదాసుపాలెంలో ఆలయ భూములను పరిశీలిస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: దేవస్థానం భూముల్లో మట్టి తవ్వకాలు సహించేది లేదని అంతర్వేది దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని కేశవదాసుపాలెంలోని ఆలయ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్న సంఘటనలపై ఆలయ సిబ్బందితో వెళ్లి ఆయన పరిశీలించారు. అక్రమంగా మట్టి తవ్వుతున్న రైతులపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. సూపరింటెండెంట్ పార్థసారథి, ఆలయ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సాయం


వంటసామగ్రి అందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు


ఆర్థిక సాయం అందిస్తున్న తెలగా సంఘ నాయకులు

రాజోలు: శివకోటి గెద్దం వారి గ్రూపులో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం బాధితురాలు తెన్నేటి నాగరత్నం కుటుంబానికి బరకాలు, వంట సామగ్రి కిట్, 75 కేజీల బియ్యం, నిత్యావసరాలను పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల రెడ్‌క్రాస్ సమన్వయకర్త జంపన బుజ్జిరాజు పంపిణీ చేశారు. జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు అల్లూరు మధురవి రామరాజు, బోనం రాజు, గిడుగు సుబ్బారావు, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మండలంలోని సఖినేటిపల్లిలంకలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన పడవల సూర్యనారాయణ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అతని కుటుంబానికి శివకోటి తెలగా సంఘం అండగా నిలిచింది. సంఘం తరపున సమకూర్చిన రూ.15 వేలను సోమవారం బాధిత కుటుంబానికి అందించారు. సంఘ పెద్దలు అడబాల శ్రీఆంజనేయులు, సర్పంచ్ రేపూరి ఏసు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో తులా సత్యనారాయణ, దూది స్వామి, పాటబళ్ల సూరిబాబు, నామన నాగభూషణం, గునిశెట్టి రాంజీ, కొండా కిషోర్, వాస్కూరి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుని బోనాల పండగ


యర్రంశెట్టివారిపాలెంలో వేంచేసిన వీరభద్రస్వామి

పి.గన్నవరం: యర్రంశెట్టివారిపాలెంలో వేంచేసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఆలయంలో కొప్పుల వారి కుటుంబాల ఆధ్వర్యంలో జంగమదేవర వీర కుమారులతో సోమవారం వీరన్నబాబు బోనాల పండగ వైభవంగా జరిగింది. స్వామిని పురవీధుల్లో బ్యాండు మేళాలతో, బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. ఆలయ ఆవరణలో జమ్మిపూజ వద్ద పూజ చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న సమారాధన చేశారు. రాత్రి వీరభద్ర స్వామి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన సదస్సు

పి.గన్నవరం: బాలల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు అన్నారు. నరేంద్రపురం గురుకుల పాఠశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.శాస్త్రి అధ్యక్షతన సోమవారం బాలల చట్టాలు, హక్కుల పరిరక్షణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై విద్యార్థులకు శ్రీనివాసరావు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కడైనా బాలలు వేధింపులకు గురైతే 1098 కాల్ చేసి, సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు ఉత్తమవిద్య అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్సై మురళీమోహనకృష్ణ, డాక్టర్ పి.నాగేశ్వరరావు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్‌లో ప్రతిభ


ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపి హర్షిణి, నితీష్‌కుమార్

రాజోలు: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో చింతలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు పితాని హర్షిణి, చింతలపల్లి నాగ నితీష్‌కుమార్‌లు ప్రతిభ చూపారు. ఈ మేరకు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. గత నెల 27, 28, 29 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కర్నూలులో నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో హర్షిణి కాంస్య పతకం, నాగ నితీష్‌కుమార్ రజత పతకం సాధించారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు, మట్టా సురేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

గోమాతకు దశ దినకర్మ పూజలు


గోమాత చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రైతు కుటుంబ సభ్యులు

ఆలమూరు: భారత హిందూ సనాతన సంప్రదాయ పద్ధతిలో గోవుకు అత్యంత ప్రాధాన్యం ఉంది. గోమాతను పూజిస్తే సకల శుభాలు జరుగుతాయని ప్రతీతి. గుమ్మిలేరులో ఇటీవల మృతి చెందిన పుంగనూరు జాతికి చెందిన గోమాతకు సోమవారం ఘనంగా దశ దినకర్మ పూజలు జరిగాయి. స్థానిక జైన్ దేవాలయం పక్కన ఉన్న పశుపోషకులు, ఉత్తమ పాడి రైతు అవార్డు గ్రహీత రెడ్డి సత్తిబాబుకు చెందిన పుంగనూరు ఆవు వయసు రీత్యా ఏర్పడిన అనారోగ్యం కారణంగా ఈనెల మూడున మృతి చెందిన విషయం తెలిసిందే. ఆరోజు శాస్త్రోక్తంగా రైతు సత్తిబాబు తన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు జరిపించారు. మళ్లీ పది రోజుల అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కుటుంబ సభ్యులతో కలిసి గోమాతకు పూజలు నిర్వహించి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. పార్టీ రాష్ట రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఎంపీటీసీ యార్లగడ్డ రమేష్, వెటర్నరీ ఏడీలు ఒ.రామకృష్ణ, ఎల్.అనిత విచ్చేసి గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాయితీలను సకాలంలో అందించాలి


అంబాజీపేటలో ఆర్ఐకు వినతిపత్రం ఇస్తున్న రైతు సమాఖ్య సభ్యులు

అంబాజీపేట: కేంద్ర, రాష్ట ప్రభుత్వాల నుంచి రైతులకు ఇచ్చే పెటుబడి రాయితీలను సకాలంలో చెల్లించాలని మాచవరం రైతు సమాఖ్య సభ్యులు పేర్కొన్నారు. పీఎం, సీఎం కిసాన్ నగదును రైతుల ఖాతాలో వెంటనే జమ చేయాలని కోరుతూ అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సమాఖ్య నాయకులు నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సమాఖ్య సభ్యులు మాట్లాడుతూ రైతులకు, కౌలు రైతులకు ఇచ్చే పెట్టుబడి రాయితీలను జనవరి నెలలో ఇచ్చేలా కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. పంట పొలాలకు వచ్చే నీటి, మురుగు బోదెలు ఆక్రమణలకు గురయ్యాయని తక్షణమే వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్ఐ ఎండీ ఇబ్రహీంకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఏజీఎల్ మోటార్లకు ఇచ్చే విద్యుత్ సరఫరాను వచ్చే వేసవిలో నీటితడులకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొర్లపాటి కోటబాబు, నక్కా భాస్కర్, ఎం.పరమేశ్వరరావు, ఎన్‌వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేద్దాం


కుష్ఠు వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాలు అందిస్తున్న దాతలు

మామిడికుదురు: కుష్ఠు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని జిల్లా పారా మెడికల్ ఆఫీసర్ కేవీవీ వరలక్ష్మి సూచించారు. నగరం పీహెచ్‌సీ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో పలువురు దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందించిన కంచాలు, గ్లాసులు, కూరగాయలు, దుప్పట్లు, బ్రెడ్లు, పండ్లు, నిత్యావసరాలను కుష్ఠు వ్యాధి బారిన పడిన 28 మందికి పంపిణీ చేశారు. సమావేశంలో వరలక్ష్మి మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి కేసులు గతం కన్నా ఇప్పుగు గణనీయంగా తగ్గాయన్నారు. కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా మార్చే బృహత్తర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాలెం రమణకుమారి, కుసుమ శ్రీధర్, హెచ్ఎం సీహెచ్ నిరంజని, డీపీఎంఓ కె.సాయిబాబా పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

అంబాజీపేట: మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు కన్వీనర్లు సోమవారం తెలిపారు. అరిగెల శివకల్యాణ్, కో కన్వీనర్లుగా కోమలి సురేంద్ర కుమార్, నాగాబత్తుల శశి, వీరా శ్రీరామ్, నక్కా నవీన్‌లను నియమించారు. తమకు పదవులు వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు, పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కల్యాణ్ తెలిపారు.

17న మండల పరిషత్ సమావేశం

మామిడికుదురు: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కుసుమ వనజకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి

మామిడికుదురు: భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాష్ట్రీయ దళిత సేన ఫౌండర్, సోషల్ వర్కర్ హమారా ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను దళితులు తీవ్రంగా ఖండించారు. పాశర్లపూడిలోని అంబేడ్కర్, రమాబాయి విగ్రహాల వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ నగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నిరసనలో కుసుమ వినోద్, భూపతి పరమేష్, భయ్యా వరప్రసాద్, బత్తుల సురేష్‌బాబు, కత్తిమండ సురేష్, గెద్దం నాగరాజు పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన కూలీ

మామిడికుదురు: పాశర్లపూడిబాడవలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీ పెసింగు లక్ష్మి సోమవారం పాము కాటుకు గురైంది. ఆమెను వెంటనే అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పాశర్లపూడి బాడవ రామాలయం నుంచి శ్రీరామ్ పేటకు నాలుగు రోజుల నుంచి మట్టి రోడ్డు వేస్తున్నారు. సుమారు 50 మంది కూలీలు ఈ పనుల్లో పాల్గొంటున్నారు. యథావిధిగా ఉపాధి పనులు చేస్తున్న లక్ష్మి పాముకాటుకు గురైంది. లక్ష్మిని కరిచిన పామును రక్తపింజరగా స్థానికులు గుర్తించారు. ఆమెకు ప్రాణాపాయం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సాగునీరు అందించాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

అంబాజీపేట: శివారు ప్రాంత భూములకు సాగునీరు అందక వరి చేలు ఎండిపోతున్నాయని తక్షణమే నీరు ఇవ్వాలని వ్యాఘ్రేశ్వర ఐక్య రైతు సంఘ నాయకులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఏ విధమైన ముందస్తు సమాచారం ఇవ్వకుండా వంతుల వారి విధానం ద్వారా నీటిని విడుదల చేయడం సంబంధిత శాఖ అధికారులకు సరికాదన్నారు. తక్షణమే వీటిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులకు అందజేసినట్లు రైతు సంఘ అధ్యక్షులు కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, ఎ.శ్రీనివాస్, వీర రవి, ఎ.వీరభద్రరావు, కేవీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యులు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని ఆయన వివరించారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: సబ్‌స్టేషన్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం సీఆర్సీ, కొమరాజు లంక 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. కొత్తకాలనీ, సీఆర్సీ రోడ్డు, వెదిరేశ్వరం రోడ్డు, రావులపాడు రోడ్డు, కొమరాజు లంక ఏరియాలకు విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పబ్లిక్ కుళాయి ధ్వంసంపై ఫిర్యాదు

రాజోలు: తాటిపాకలోని పంచాయతీ రోడ్డులో పబ్లిక్ కుళాయి సీసీ దిమ్మను ధ్వంసం చేసి ప్రభుత్వభూమిని ఆక్రమించిన వారిపై మాజీ ఎంపీటీసీ సభ్యుడు మెడబల రాజ్‌కుమార్ సోమవారం ఎంపీడీఓ ఎస్.బాలాజీకి ఫిర్యాదు చేశారు. పబ్లిక్ కుళాయి తొలగించి ఆ స్థలాన్ని ఆక్రమించి ప్రైవేటు లే-అవుట్‌కు రోడ్డు నిర్మాణం చేసేందుకు పనులు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం ఆ పనులు నిలుపుదల చేసి ధ్వంసమైన పబ్లిక్ కుళాయిని నిర్మాణం చేయాలని, ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు.

మడికిలో తాటాకిల్లు దగ్ధం

ఆలమూరు: మండలంలోని మడికిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైన సంఘటనలో జాస్తి బాబూరావు కుటుంబం నిరాశ్రయమైంది. స్థానికుల కథనం ప్రకారం స్థానిక జెడ్పీ రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న బాబూరావు ఇంట్లోంచి హఠాత్తుగా మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో పరిసర ప్రాంత ప్రజలు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మండపేట నుంచి అగ్ని మాపకదళ సిబ్బంది వచ్చే లోపే మంటలు వ్యాపించి ఇరు కుటుంబాలకు చెందిన గృహోపకరణాలు, వంట పాత్రలు, దుస్తులు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో కొన్ని విలువైన వస్తువులను తీసుకునేందుకు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన బాబూరావు భార్య ఇందిరకు గాయాలయ్యాయి. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఆస్తి నష్టం సుమారు రూ మూడు లక్షల వరకూ ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

హైవేపై చెట్లు నరికితే కఠిన చర్యలు

ఆలమూరు: 216 ఏ నంబర్ జాతీయ రహదారిలో చెట్లు నరికితే కఠిన చర్యలు తప్పవని ఈతకోట హైవే టోల్‌ప్లాజా మేనేజర్ నేహెమ్యా అన్నారు. మండలంలోని జొన్నాడ హైవే వెంబడి చెట్లు నరికివేశారని ఫిర్యాదు అందడంతో ఆ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు.